క్లుప్తంగా

జాతీయ భావం కోసమే హర్ ఘర్ తిరంగా



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దెందులూరు: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో జాతీయ భావం పెంపొందించడం అవగాహన కల్పించడమే హర్ ఘర్ తిరంగా లక్ష్యమని దెందులూరు ప్రజ్ఞ యూపీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ జి సువర్చల వెంకట్ అన్నారు. శనివారం పాఠశాలలో అవగాహన సమావేశం నిర్వహించి స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణ త్యాగం చేసిన వీరుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో ముగ్గులు వేశారు. అనంతరం జాతీయ జెండాలు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు.

ఉంగుటూరులో వర్షం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. ఎండలు తీవ్రంగా కాస్తున్న తరుణంలో వర్షం కురవడంతో వాతావరణం కాస్తచల్లబడింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రైతులకు ఈ వర్షం మేలు చేసినట్లు అయ్యింది. నీరందని చేలకు, బోర్లు లేని రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

రావులపర్రు రోడ్డులో చెట్ల నరికివేత



చెట్లు నరికేసిన దృశ్యం

ఉంగుటూరు: మండలంలోని ఉంగుటూరు–రావులపర్రు రోడ్డులో చెట్ల నరికివేతపై పర్యావరణ ప్రేమికులు మండిపడుతున్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా ఉన్న చెట్లు వాహనచోదకులకు నీడనిచ్చేవి. అయితే ఈ చెట్లను ఇటీవల విచక్షణారహితంగా నరికేశారు. చెట్ల నరివేతపై పర్యావరణ ప్రియుడు కొరిపల్లి అప్పారావు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తానని వివరించారు.

శ్రీవారి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాత రామకృష్ణంరాజుకు విరాళం బాండ్ అందిస్తున్న కిషోర్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన మంతెన రామకృష్ణంరాజు శనివారం రూ.1,00,116 విరాళంగా అందించారని ఆలయ సూపరింటెండెంట్ కోటగిరి కిషోర్ తెలిపారు. దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందించామని, తొలుత ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారని పేర్కొన్నారు.

ప్రతి ఆదివారం హనుమద్ హోమం



మద్ది ఆంజనేయస్వామికి అభిషేక సేవ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో ప్రతి ఆదివారం హనుమద్ హోమం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ ఆర్‌వీ చందన శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు హనుమద్ హోమం ఉంటుందని, పాల్గొన్న దంపతులకు వీఐపీ దర్శనం, వేదాశీర్వాదం కల్పిస్తున్నామని వివరించారు. మద్ది ఆంజనేయస్వామికి శనివారం సందర్భంగా అభిషేక సేవ చేసినట్టు చెప్పారు. వివిధ సేవలు, విరాళాల ద్వారా ఆలయానికి రూ.1,41,469 ఆదాయం సమకూరిందన్నారు.

గజ్జ పూజ

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో ఏలూరుకు చెందిన విష్ణు భజన మండలి సభ్యులు శనివారం గజ్జ పూజ నిర్వహించారు. సుమారు 30 మంది మహిళలు, బాలికలు మండపంలో కూర్చుని గజ్జలకు పూజ లు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, ఆలయ ఆవరణలో తొలి కోలాట నృత్యాలు చేశారు. ఇవి భక్తులను అలరించాయి.

వేద ఘోష.. దైవ ధ్యాస

- ముగిసిన 105వ వేద శాస్త్ర పరిషత్
- ఉత్సాహంగా పాల్గొన్న వేద విద్యార్థులు
- ఉత్తీర్ణులకు సర్టిఫికెట్ల అందజేత



వేద పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సూచనలిస్తున్న వేద పండితులు

గణపవరం: మండలంలో సరిపల్లెలో తితిదే కల్యాణ మండపంలోని సభ్యాభివర్ధక నిలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన 105వ వేదపరిషత్ మహాసభ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన వేద పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులనుద్దేశించి వేదపండితులు, ఘనపాఠీలు పలు సూచనలు ఇచ్చారు. దేశ వ్యాప్తంగా పది రాష్ట్రాల నుంచి వేద విద్యార్థులు ఇక్కడ నిర్వహించిన వేద పరీక్షలలో పాల్గొన్నారు. రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాల్లో ఘనాపాఠీలు పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు కార్యక్రమ నిర్వహణకు సహకరిస్తున్న దాత సాగిరాజు సుబ్బరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

సర్టిఫికెట్‌కు ఎంతో విలువ

ఈ కార్యక్రమంలో తితిదే వేదవిశ్వవిద్యాలయం విశ్రాంత ప్రిన్సిపల్ గుల్లిపల్లి విశ్వనాథ ఘనపాఠీ మాట్లాడుతూ తాను ఐదు దశాబ్దాలక్రితం ఇక్కడికి వచ్చి పరీక్ష రాసి ఉత్తీర్ణుడయ్యాయనని తెలిపారు. ఇక్కడ ఇచ్చే యోగ్యతా పత్రానికి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఇక్కడి నుంచి వెళ్లిన వందలాది మంది వేద విద్యార్థులు రాష్ట్రంలోనే కాక దేశ, విదేశాల్లోని పలు ప్రతిష్టాత్మక దేవాలయాలు, వేద పాఠశాలలు, వేద విశ్వ విద్యాలయాలలో పూజారులుగా, అధ్యాపకులుగా, వేదపండితులుగా పని చేస్తున్నారని తెలిపారు. తిరుపతి వేద విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ గోవింద్‌ప్రసాద్ అధికారి మాట్లాడుతూ వేదాలు లోక కల్యాణానికి ఉపయోగపడతాయని, సనాతన ధర్మానికి ప్రతీకలైన వేదాలను పరిరక్షించడానికి మీరంతా కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు.

అర్ధ శతాబ్దం క్రితం పరీక్ష రాశాను



నేను తితిదే వేదపాఠశాల ప్రధానాచార్యునిగా పనిచేసి పదవీ విరమణ చేశాను. 35 సంవత్సరాలుగా ఇక్కడ నిర్వహించే వేద పరీక్షలకు పరీక్షాధికారిగా వస్తున్నాను. కాలం మారుతున్నా, సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందుతున్నా, మన సంస్కృతీ, సంప్రదాయాలు మరువకూడదు. ముఖ్యంగా వేదాల పరిరక్షణకు అందరూ కృషి చేయాలి. ప్రస్తుతం 30 మంది వేద విద్యార్థులను కృష్ణయజుర్వేదంలో పరీక్షించాను. – గుళ్లపల్లి విశ్వనాథ ఘనపాఠీ, హైదరాబాద్

నేపాల్ నుంచి వచ్చి వేదపండితుడిగా



మాది నేపాల్ దేశం. చిన్నతనంలోనే అస్సాం వచ్చి వేద పాఠశాలలో వేదవిద్య నభ్యసించాను. ప్రస్తుతం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో శుక్ల యజుర్వేదంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాను. పది మంది వేద విద్యార్థులను మధ్యందిన శాఖలో పరీక్ష నిర్వహించాను. – గోవిందప్రసాద్ అధికారి, శుక్లయజుర్వేద పరీక్షాధికారి

వేద విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాను



సరిపల్లెలో నిర్వహించే వేదపరీక్షలకు నేను దశాబ్దకాలంగా పరీక్షాధికారిగా వస్తున్నాను. విశాఖపట్నంలో శుక్లయజుర్వేదంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాను. ఏటా ఒక బ్యాచ్ చొప్పున ఎంపిక చేసుకుంటాను. ఒక్కో బ్యాచ్‌కు పదకొండు సంవత్సరాలు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. – రాపర్తి నరేంద్రకుమార్ ఘనపాఠీ, విశాఖపట్నం

ఇక్కడ ఇచ్చే సర్టిఫికెట్టుకు ప్రాధాన్యత



మాది రాజస్తాన్ రాష్ట్రం. రాజస్థాన్‌లో వేదవిద్య రెండు సంవత్సరాలు, హైదరాబాద్‌లో రెండేళ్లు, కుంభకోణంలో ఏడాది. విశాఖపట్నం వేదపాఠశాలలో మూడేళ్లు సామవేదం అభ్యసించాను. ఇక్కడ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని పెద్దలు చెప్పడంతో పరీక్ష రాయడానికి వచ్చాను. – రోహిత్‌శర్మ, రాజస్తాన్

ఇక్కడ ఏర్పాట్లు బాగున్నాయి



నేను బీహార్ రాష్ట్రం నుంచి వచ్చాను. ఇక్కడ గాయత్రి బ్రాహ్మణసేవా సంఘం వారు చేసిన ఏర్పాట్లు చాలా బాగున్నాయి. ప్రశాంత వాతావరణంలో పరీక్షకు హాజరయ్యాను. కృష్ణాజిల్లా చిల్లకల్లు వేద పాఠశాలలో రెండేళ్లు, ఆగిరిపల్లి వేదపాఠశాలలో ఏడేళ్లు వేద విద్యనభ్యసించి, ఇక్కడ పరీక్షరాయడానికి వచ్చాను. – రఘునందన్‌ఓజా, బీహార్

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తత అవసరం



అంబర్‌పేటలో టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీహెచ్ఈవో వైవీ లక్ష్మణరావు

భీమడోలు: సమష్టి కృషితో కీటక జనిత వ్యాధులను నివారించుకుని ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని పూళ్ల ఆరోగ్య విస్తరణాధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. అంబర్‌పేట గ్రామంలో శనివారం నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వ్యాధులు ప్రబలుకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి బారిన పడిన తర్వాత కన్నా ముందుగానే పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లె నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, కీటక జనిత ప్రదేశాలను నిలువరించాలని కోరారు. ఇలా చేస్తే దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, బోధకాలు, మెదడువాపు వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యంలో బిడ్డ ఆరోగ్యానికి టీకా అవసరమన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు ధనలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ లత పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



గుండుగొలనులో పూజలందుకుంటున్న శ్రీవేంకటేశ్వర స్వామి వారు



ఆర్జావారిగూడెంలో దీపాలను వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

భీమడోలు: మండలంలోని గుండుగొలనులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వార్లకు శనివారం స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని విశేష పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అగ్నిహోత్రం మంగపతి ఆచార్యులు, సాయి ఆచార్యులు సంయుక్తంగా స్వామి వార్లకు అభిషేకాలు చేశారు. స్వామి వార్లను నూతన వస్త్రాలు ధరించి సుందరంగా అలంకరించి ముస్తాబు చేసారు. స్వామి వార్లను భక్తులు అధిక సంఖ్యతో తరలి వచ్చి దర్శించుకున్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు, భక్తులు పాల్గొన్నారు. అలాగే భీమడోలు పంచాయతీ పరిధిలోని ఆర్జావారిగూడెంలోని రామాలయంలో రాత్రి భక్తులు రాఖీ పౌర్ణమి సందర్భంగా పూజలు చేశారు. లోక రక్షకుడైన శ్రీరాముడు కుటుంబానికి, గ్రామానికి రక్షణగా ఉండాలని కోరుకుంటూ దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.



ఆంజనేయ స్వామి జలాభిషేకం చేస్తున్న భక్తులు



వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆంజనేయ స్వామికి సింధూర జలాభిషేకం

దెందులూరు: స్థానిక ఇంద్రవనం సెంటరులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆలయ నిర్వాహకులు సంపెంగ అప్పారావు, సంపెంగ సతీష్, సంపంగి గణేష్ కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు సింధూర జలాభిషేకం నిర్వహించారు. శ్రీ ఆంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకులు భక్తులు ప్రత్యేక పూజలు అభిషేకాలు ప్రదక్షిణలు నిర్వహించారు. ఆదివారం 108 సార్లు హనుమాన్ చాలీసా అనంతరం 11 గంటలకు మహా అన్న సమారాధన నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఆప్యాయతకు ప్రతీక రక్షాబంధన్



గణపవరం: బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాఖీ కడుతున్న దృశ్యం



దెందులూరు: ఫాదర్స్‌కు రాఖీ కడుతున్న దృశ్యం

గణపవరం: రాఖీపండుగ అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి, ఆప్యాయతలకు ప్రతీక అని వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు అల్లూరి గంగరాజు అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం బాలుర ఉన్నత పాఠశాలలో వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో రాఖీ ఉత్సవం నిర్వహించారు. హెచ్ఎం జి.వీరవేణి మాట్లాడుతూ అందమైన అనుబంధం, అంతులేని అనురాగం అన్నాచెల్లెళ్ల బంధమని అన్నారు. ఈ సందర్భంగా బాలికలు బాలురకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజకుమారి పాల్గొన్నారు.

దెందులూరులో..

దెందులూరు: అన్నాచెల్లెళ్ల అనురాగం అనుబంధానికి మరిచిపోలేని మరుపురాని పండుగ రక్షాబంధన్ అని ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ బాల అన్నారు. శనివారం గ్రామ గ్రామాన ఇంటింటా విద్య వైద్య ఆధ్యాత్మిక సంస్థల్లో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెయింట్ జాన్స్‌విద్యాసంస్థల్లో వికార్ జనరల్ డాక్టర్ బాల సోదరుడు డాక్టర్ చార్లెస్‌కు వారి సోదరీమణులు డాక్టర్ అరుణ, డాక్టర్ జ్యోతి రాఖీలు కట్టారు.

పారిజాతగిరిలో పూజలు



పారిజాతగిరి వెంకటేశ్వరస్వామి వారికి హారతి ఇస్తున్న అర్చకుడు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. శ్రీదేవి భూదేవి అమ్మవారి శ్రీనివాసని కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. గిరి ప్రదక్షిన చేసిన భక్తుకలు ప్రత్యేక దర్శనం, ప్రసాదం పంపిణీ చేశామని ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. అప్పలరాజుగూడెం చెందిన నాదెళ్ల రాయుడు, ఆయన కుటుంబ సభ్యుల సాయంతో అన్నదానం చేశామని పేర్కొన్నారు. శనివారం వివిధ సేవల రూపేణా ఆలయానికి రూ.1,50551 ఆదాయం వచ్చిందన్నారు.

చవితికి సిద్ధమైన గణనాథులు

జంగారెడ్డిగూడెం: గణపతి నవరాత్రులకు ఉత్సవ కమిటీలు సన్నద్ధమయ్యాయి. వివిధ ఆకృతుల్లో గణనాథుల విగ్రహాలను రూకర్తలు సిద్ధం చేశారు. ఉత్సవ కమిటీల అభిరుచులకు అనుగుణంగా వివిధ సైజుల్లో బొజ్జగణపయ్య రూపాలు అందుబాటులో ఉన్నాయి. ఆయా విగ్రహాల కూర్పు, సైజును బట్టి ఒక్కొక్క విగ్రహానికి ఒక్కొక్క రేటును విక్రయదారులు నిర్ణయించారు. ఈ నెల 27 నుంచి గణపతి నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో గణపతి ప్రతిమను ప్రతిష్ఠించి వైభవంగా నవరాత్రులు నిర్వహించనున్నారు. మూడు రోజుల నుంచి 9 రోజులకు వరకు ఆయా కమిటీల సన్నద్ధతను బట్టి ఉత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. సైజు, మోడల్‌ను బట్టి ఒక్కొక్క విగ్రహం రూ. 5వేల నుంచి రూ.25వేల వరకు అమ్ముతున్నారు. విజయవాడ, హైదరాబాద్, నున్న, స్థానికంగా తయారు చేసిన విగ్రహాలను జంగారెడ్డిగూడెం హైస్కూల్ సెంటర్ వద్ద, జేపీ సెంటర్, బైపాస్ రోడ్డులో విగ్రహాలను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.



పంచముఖ ఆంజనేయ సమేత వినాయకుడు



గంధర్వులతో గణపతి



శివకేశవుల సమేత వినాయకుడు



రథంపై గణనాథుడు



సమర వినాయక, వెనుక ఛత్రపతి శివాజీ

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

చింతలపూడి : స్థానిక వీకేఎం ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ చింతలపూడి పట్టణ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పార్టీ పట్టణ అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు (నాగు) తెలిపారు. బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. ముఖ్య అతిథులుగా పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్, చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జయప్రకాష్, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాథరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌లు హాజరవుతారని వివరించారు.

కూలిన వృక్షాలతో ట్రాఫిక్ జామ్

లింగపాలెం: మండలంలోని ధర్మాజీగూడెం సమీపంలో భారీ వృక్షాలు నేల కూలాయి. దీంతో ఏలూరు – చింతలపూడి రోడ్డుపై ట్రాఫిక్ జామైంది. శనివారం కురిసిన గాలీవానకు రోడ్డు వెంబడి ఉన్న 8 భారీ వృక్షాలు నేలకొరిగాయి. రహదారిపై వాహనాలు బారులు తీరాయి. స్థానికులు ట్రాక్టర్ల సాయంతో చెట్లను తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. కాగా, చెట్లు కూలిన ఘటనలో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.